# పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-జైపూర్

భారీగా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కోటపల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె ఆసుపత్రిలో వార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి జ్వర పీడితుల నుండి రక్త నమూనాల సేకరించి వ్యాధుల తీవ్రతను బట్టి వైద్య సేవలు అందించాలని అన్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించిన ఆమె పారిశుధ్య పనులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. కాగా ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏకదాటి ఆ వర్షాలు కురుస్తున్నందున నదుల్లో పడవ ప్రయాణాలు నిషేధించాలని, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com



# గ్రామాలను పరిశీలించిన ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీని సోమవారం మండల ప్రత్యేకాధికారి, డీటీడీవో గంగారాం పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను, తాగునీటి పైప్ లైన్ లీకేజీ పనులను పర్యవేక్షించారు. దీంతో పాటు పలు గ్రామాలను సందర్శించి గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు ఈగలు ద్వారా ప్రజలు వ్యాధుల భారిన పడే అవకాశం ఉన్నందున ఫాగింగ్ చేయించాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. అధిక వర్షాలు కురుస్తున్నందున వాగులు, చెరువుల ఉధృతిని పరిశీలించి, ప్రజలు వాగులు, చెరువుల వైపు వెళ్లకుండా ఇంట్లోనే ఉండేలా చూడాలని, అత్యవసరం అయితే తప్పా ప్రజలు బయటికి రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, పంచాయితీ కార్యదర్శి శ్రీధర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధికి ఊతం..!

- అతివల ఆర్థిక అభివృద్ధి దిశగా పథకాలకు శ్రీకారం
- మహిళా శక్తి పథకం కింద వివిధ యూనిట్లు స్థాపన
- లబ్దిదారుల గుర్తింపు.. ఏడాదిలోపు రుణలక్ష్యం పూర్తి
- కార్యాచరణ రూపొందించిన అధికార యంత్రాంగం

**ప్రభుత్వం అతివల స్వయం ఉపాధికి ఊతమిస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సాయం అందించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా వివిధ పథకాలకు అంకురార్పణ చేసింది. సూక్ష్మ ప్రణాళిక తయారుచేసి స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే లబ్దిదారులను గుర్తించిన అధికారులు వారితో ఆయా యూనిట్లను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించారు. మహిళా శక్తి ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే జిల్లాలో నాలుగు క్యాంటీన్లను ప్రారంభించిన అధికారులు మిగితా యూనిట్లను కూడా త్వరగానే గ్రౌండింగ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో వేలాది మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేయనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.**



ఇటీవల ఇచ్చోడలో మహిళశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం అతివల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తూ ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారు. తాజాగా కొత్త ప్రభుత్వం మరిన్ని పథకాలకు అంకురార్పణ చేసింది. సుమారు పదిహేను రకాల యూనిట్లను స్థాపించి వాటి ద్వారా స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. మైక్రో ఎంటర్‌ప్రైసెస్, ఎంఎస్ఎంఎస్‌సీ(మీసేవ)లు, స్టిచ్చింగ్ సెంటర్లు, మహిళా శక్తి క్యాంటీన్లు, పాడిగేదెలు, పెరటికోళ్ల పెంపకం, కోళ్లఫారాలు, మిల్క్ పార్లర్లు, వ్యవసాయ పరికరాలు అద్దెకివ్వడం, ఆహార ఉత్పత్తుల యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్లు, సోలార్ యూనిట్లు తదితర వాటిని స్థాపించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే లబ్దిదారులను ఎంపిక చేసిన అధికారులు వారికి సంబంధించి యూనిట్లను నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 6866 యూనిట్లను ప్రతిపాదించగా..వీటికి గాను 8555మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు రూ.66.31లక్షల నిధులను వెచ్చించనున్నారు. ఇప్పటి వరకు 6693 యూనిట్లను గుర్తించగా.. వీటిని నిర్వహించేందుకు 7763మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందుకు గాను రూ.64.03లక్షలను ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లక్ష్యంలో ఇప్పటి వరకు 1165మందికి రుణాలు మంజూరు చేయగా.. వీరికిగాను యూనిట్లను గ్రౌండింగ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

## ఏడాదిలోపు లక్ష్యం పూర్తిచేస్తాం

బిట్ల గంగన్న, డీపీఎం, డీఆర్‌డీఏ



ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మహిళా శక్తి ప్రోగ్రాంలో భాగంగా రూపొందించిన కార్యాచరణను ఏడాదిలోపు పూర్తిచేస్తాం. ఇప్పటికే కొన్ని యూనిట్లను లబ్ధిదారులకు అందించడం జరిగింది. మిగిలిన వాటిని సైతం స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ పథకాలు అమలు చేయడం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తాం.

**ఏడాదిలోపు పూర్తికి కార్యాచరణ..!**

ఆదిలాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా అందించనున్న ఈ రుణాలను ఏడాదిలోపు పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రానున్న ఏడాది మార్చి 31లోపు ఈ యూనిట్లను లబ్ధిదారులకు అందించాల్సి ఉంటుంది. సూక్ష్మ ప్రణాళిక రూపొందించి స్త్రీనిధి బ్యాంకు ద్వారా అర్హులకు అందించనున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆయా ప్రాధాన్యతల ప్రకారం లబ్ధిదారులకు వీటిని కేటాయించనున్నారు. ఎవరికి ఎలాంటి యూనిట్లు అందిస్తే మేలు జరుగుతుందో ముందస్తుగానే ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నారు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించేలా అధికార యంత్రాంగం అవసరమైన సహాయ సహకారాలు అందించనుంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు చోట్ల మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించగా మిగిలిన వాటిని సైతం పూర్తిచేసేందుకు కృషిచేస్తామని అధికారులు చెబుతున్నారు.

# జితేంద్ర చౌదరిపై దాడిని ఖండిస్తున్నాం

- టీఏజీఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ (ఏఏఆర్ఎం)జాతీయ చైర్మెన్, త్రిపుర ప్రతి పక్ష నేత జితేంద్ర చౌదరిపై త్రిపుర రాష్ట్ర బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు వారి ఇంటిపై దాడి చేయడాన్ని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఖండిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలను, ఆదివాసీల సమస్యలపై నిరంతరం పని ఆదివాసుల అభివృద్ధికి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న తమ జాతీయ నాయకుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మానక పోతే దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ విశ్వహిందూ పరిషత్ సంఘాలు ఆదివాసీ ప్రజల్లో మతోన్మాద భావాలు రెచ్చగొట్టి ప్రజల్లో మత ఉద్రిక్తలు రెచ్చ గొట్టే ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టడి చేయాలనీ పేర్కొన్నారు. దాడి చేసేందుకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# కొలాం గిరిజన గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని దేవాపూర్ పరిధిలోని పెద్దాపూర్ కొలం ఆదివాసీ గిరిజన కమిటీలను సోమవారం గిరిజన గ్రామస్తులు ఎన్నుకున్నారు. పెద్దాపూర్లో ఉన్న పెద్దాపూర్, కొలంగూడ, పావుగూడ, జెండాగూడెం, గూడాల్లోని కొలం ఆదివాసీ గిరిజనులు తమ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెండాగూడెంకు చెందిన టేకం భీంరావ్, ప్రధాన కార్యదర్శిగా పెద్దాపూర్ కొలంగూడకు చెందిన ఆత్రం భీంరావ్, గౌరవాధ్యక్షులుగా పావుగూడకు చెందిన కొడప భీంరావ్, కోశాధికారిగా టేకం భగవంత్ రావు, కోశాధికారి టేకం భీంరావ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా నాయకులు ఆత్రం మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిందీ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ భాష హిందీ దినోత్సవ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందీ పండితులు, హిందీ భాష సేవకులంతా కలిసి చేస్తున్న ఉత్సవ పోస్టర్లను డీఈఓ టి.ప్రణీతతో కలిసి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ భాషా సేవా సమితి వారు నిర్వహిస్తున్న హిందీ దినోత్సవ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులంతా పాల్గొనాలని, అలాగే విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించి, హిందీ భాషాభివృద్ధికి జిల్లాలోని ఉపాధ్యాయులు అంతా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, ఉపాధ్యక్షులు రవి జబాడే, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్, సెక్టోరల్ అధికారులు శ్రీకాంత్‌గౌడ్, సుజాత్ ఖాన్‌లు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘాలుగా హోద పత్రాన్ని అందుకున్న నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

గత సంవత్సరం డిసెంబర్ 27న జరిగిన సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా గుర్తింపు పొందిన ఐఎన్టీయూసీ నాయకులు సోమవారం హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో సీ అండ్ ఎండీ చేతుల మీదుగా హోదా పత్రాలను అందుకున్నారు. రెండు సంవత్సరాల కాల పరిమితం హోదా పత్రాలను నాయకులకు అందజేశారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ 16,178 ఓట్లు గెలిచి గుర్తింపు సంఘంగా గెలుపొందింది. అలాగే ఐఎన్టీయూసీ 14,178 ఓట్లు సాధించి ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందింది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా గుర్తింపు పత్రాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, అప్రోజ్ ఖాన్ అందుకున్నారు. ప్రాతినిధ్య సంఘం పత్రాన్ని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, నాయకులు అందుకున్నారు.

# ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మందమర్రి

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మందమర్రిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ప్రాణహిత కాలనీకి చెందిన గాదె శ్రీనివాస్(55) తాగుడికి బానిసై తాగిన మత్తులో అప్పుడప్పుడు కింద పడిపోయేవాడు. పాలవాగు మైసమ్మ ఆలయాన్ని శుభ్రం చేస్తూ అప్పుడప్పుడు అక్కడే ఉండేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి సోమవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో మైసమ్మ గుడి దగ్గరికి వెళ్లి వెతికారు. గుడి పక్కన తన శ్రీనివాస్ చెప్పులు, గొడుగు కనిపించాయి. తాగిన మత్తులో ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు గుర్తించి డయల్ 100కి కాల్ చేసి వివరాలు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్, దుబ్బతాండ, రాణిగూడ, లక్ష్మీపూర్, దేవునిగూడెం, కొలంగూడ, కొర్రతండా, ముర్రిపేట, దత్తుజీపేట, చౌడు తండా, నాయకపు గూడెం, రాజంపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేండ్ల కింద గంగాపూర్ బ్రిడ్జి కూలిపోతే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని అన్నారు. గంగాపూర్ బ్రిడ్జిని నిర్మించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టును బాగు చేయిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు దిగులు చెందొద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఇప్పటికే అనేక ప్రతిష్టాత్మమైన పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. త్వరలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు అందజేస్తామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్దే లక్ష్యంగా తాను కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను పరిశీలించి జ్వరంతో బాధపడుతున్న 8 మంది విద్యార్థులను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారి డా. అనూషను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఎంపీడీఓ సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ ప్రాంతీయ అధికారి అరుణ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారి ఇంట్లో చోరీ



నవతెలంగాణ-జన్నారం

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి రామ్ సింగ్ రాజ్ పురోహిత్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాపారి కుటుంబ సభ్యులందరూ ఆదివారం రాత్రి మంచిర్యాలకు వెళ్లారు. తెల్లవారుజామున తిరిగి వచ్చారు. ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గ్రహించారు. ఇంట్లో ఉన్న 4 తులాల బంగారం, 30 గ్రాముల వెండి, కొంత నగదును దొంగలించారని వ్యాపారి తెలిపారు. లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్సై రాజా వర్ధన్, అదనపు ఎస్సై తానాజీ కేసు నమోదు చేసుకొని క్లూస్ టీమ్స్‌తో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అధికారిగా కొంత.. తనవంతుగా మరి కొంత

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా గ్రామీణుల సమస్యకు పరిష్కారం చూపిన ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ డీఈ విద్యాసాగర్ వ్యక్తిగతంగా గ్రామస్థులకు సహకరిస్తున్నారని వేలాల గ్రామ పంచాయతీ ప్రజలు కొనియాడుతున్నారు. ఇటీవల డిప్యూటీ డీఈగా పదోన్నతి పొందిన విద్యాసాగర్ గతంలో ఏఈగా వేలాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పని చేశారు. సోమవారం గ్రామస్థులు విద్యాసాగర్‌ను శాలువాలతో సన్మానించి అధికారిగా సమస్యల పరిష్కారం చూపిన విషయాలను గుర్తు చేశారు. గతంలో పాఠశాల విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి తన సొంత ఖర్చులతో తరగతి గదుల్లో టైల్స్ వేయించారని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అందించి గ్రామస్థుల మదిలో స్థిరస్థాయిలో నిల్చిపోయారని పేర్కొన్నారు. వేలాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యపు పనులు కొనసాగిస్తూ వీధి దీపాలు నీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూశారని గ్రామస్థులు తెలిపారు.

# కాన్వేయన్స్ డ్రైవర్ల పోరాటానికి కాంట్రాక్ట్ కార్మికుల మద్దతు



నవతెలంగాణ-నస్పూర్

కన్వెన్షన్ డ్రైవర్ల పోరాటానికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపింది. సోమవారం బెల్ట్ క్లినింగ్ కాంట్రాక్ట్ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్వేయన్స్ డ్రైవర్లకు సింగరేణి యాజమాన్యం చెల్లిస్తున్న వేతనాలను ఓనర్లు కార్మికులకు ఇవ్వకుండా, అడిగితే విధుల నుండి తొలగిస్తున్నారన్నారు. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా న్యాయబద్ధంగా పోరాడుతున్న డ్రైవర్లకు మేమంతా తోడుగా ఉంటామన్నారు. ఎలాంటి సమస్య కాంట్రాక్టు కార్మికునికి రాకుండా సింగరేణి అధికారులు చర్యలు తీసుకొని, డ్రైవర్లకు తగిన న్యాయం చేసే వరకు డ్రైవర్ల పోరాటంలో ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతుగా నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో బెల్ట్ క్లీనింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# నిమజ్జన సమయంలో జాగ్రత్త పడాలి

నవతెలంగాణ-జైపూర్

వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. సోమవారం ఇందారం సమీప గోదావరి నది వంతెన వద్ద నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. గణపతి నిమర్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. గణపతి నిమజ్జోత్స శోభాయాత్రలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై శ్రీధర్‌లను ఆదేశించారు.

# ఆర్టీసీ రాయితీ సేవలను సద్వినియోగపర్చుకోవాలి



నవతెలంగాణ-తలమడుగు

ఆర్టీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న రాయితీని మండల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పథ కాలను మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మెరుగైన ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలన్నారు. అదేవిధంగా ప్రయాణికులు ఆర్టీసీ అందిస్తున్న సేవలు, వికలాంగులకు బస్ పాసులు, వివాహ శుభకార్యాలకు రాయితీపై బస్‌ల బుకింగ్ గురించి, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి పాటించాల్సిన ఆరోగ్య నియమాల గురించి, అంతేగాక గమ్యం యాప్ గురించి, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని వివరిస్తూ సురక్షితమైన సుఖవంతమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులోని ప్రయాణించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ సిబ్బంది వీబీఓలు ఎం. శ్రీనివాస్, పి.మధు గ్రామప్రజలు అశోక్, ఆనంద్, దంజి పటేల్, ముజ్జు, వేణు, శ్రీనివాస్, అడెల్లు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నవతెలంగాణ-బేల**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, చికిత్సల వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని వైద్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండల కేంద్రంలో మరో రెండు నెలలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆర్ఎంపీ వైద్యులు తమ స్థాయికి మించి వైద్యం చేయరాదని పేర్కొన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా మలేరియా వైద్యాధికారి శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

## అన్ని వర్గాల లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

కాంగ్రెస్ పార్టీ పేదోళ్ల పార్టీని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో ఆయన సమక్షంలో కుంభఝరి, శివఘాట్, మత్తడిగూడ గ్రామాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాల కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ పేదోళ్లు ఉంటారో అక్కడ కాంగ్రెస్ ఉంటుందన్నారు. పేదలకు రేషన్ కార్డు, ఇండ్లు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, బండారి సతీష్, సంజయ్, పోతారెడ్డి, కిషన్, ఎంఏ షకీల్, ఆశన్న, రఫీక్, బండారి చిన్నయ్య పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించే వరకు ఉద్యమం



**నవతెలంగాణ-నార్నూర్**

వారం రోజుల కింద ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి, కఠినంగా శిక్షించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తుడుందెబ్బ గాదిగూడ మండల మాజీ అధ్యక్షుడు పూసం బాదిరావ్ అన్నారు. సోమవారం లోకారి(కె)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1970లో వలస వచ్చిన ముస్లిం మైనారిటీలకు భూయాజమాన్య హక్కు పత్రాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు వెంటనే రద్దు చేసి జైనూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రభుత్వమే వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. ముస్లిం మైనార్టీ అధికారులను బదిలీ చేయాలని, సంఘటనలో ఆదివాసులపై ఎదురు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల చివరి వరకు తెలంగాణ ప్రభుత్వం స్పందించని యెడల పంచాయతీ రాజ్ చట్టం, పేసా చట్టం ప్రకారం మా ఊరిలో మా రాజ్యం ప్రకటిస్తామన్నారు. వివిధ సంఘాల ఆదివాసీ నాయకులు మెస్రం దేవ్‌రావ్, మందాడి దౌలత్ రావ్, కొడప జాకు, సిడం నాగోరావ్, మడావి నటరాజ్, సిడం నాగోరావ్, కుడ్మేత భారత్, దేవ్‌రావ్ ఉన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



నిర్మల్ : అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నవతెలంగాణ-నిర్మల్**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి విద్య, వైద్యం, రుణమాఫీ, వరద నష్టం, రెవెన్యూ, ధరణి తదితర సమస్యల ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న శాఖల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగరావు, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దరాఖాస్తులను పరిశీలిస్తు సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. నమ్మకంతో ప్రజలు ఇచ్చే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా వాటిని పరిశీలించి, పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. వ్యవసాయం, విద్యా వైద్యం, ఉపాధి, డీఆర్డీఏ, మున్సిపాలిటీ, తదితర శాఖలకు సంబంధించి దివ్యాంగుల సమస్యలు, ఉపాధి, పెన్షన్, తదితర అంశాలపై దరఖాస్తులు వచ్చాయని తక్షణమే స్పందించి పరిష్కరించాలని, మొత్తం 92 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీఓ వినోద్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

**నవతెలంగాణ-లోకేశ్వరం**

మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన సుంకరి సాయవ్వ(45) గత కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ఉంది. కాగా ఈ నెల 6న శుక్రవారం ఉదయం 5గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో మృతురాలి చెల్లెలు అనురాధ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులకు సోమవారం గ్రామ చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. చెల్లెలు అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

## గుర్తించిన తమను ప్రభుత్వం మర్చిపోవద్దు

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఎన్నో ఎండ్లుగా సంచారజాతీగా ఉన్న తమను ప్రభుత్వం గుర్తించిందని, కానీ గుర్తించిన తమను మరిచిపోవద్దని ఓడ్ సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ కోరారు. గుర్తింపు వచ్చిన నాలుగేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం బీసీ సంక్షేమ భవనంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తమను ప్రభుత్వాలు గుర్తించినందుకు ధన్యవాదలు తెలిపారు. 2020 సెప్టెంబర్ 9న సంచారజాతీగా తమను బీసీ(ఏ)లో చేర్చారని తెలిపారు. అన్ని రంగాల్లో వెనకబడిన తమను ఆదుకునేలా ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఓడ్ కులస్తుల స్థితిగతులను తెలుసుకునేందుకు వచ్చిన బీసీ కమిషన్ ఛైర్మెన్ కూడా కంటతడి పెట్టుకున్నారని గుర్తు చేశారు. ఓడ్ కులస్తులను ఓబీసీలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ఓడ్ సంఘం అధ్యక్షుడు చవాన్ ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహితే, మారుతి, భీంరావు, చవాన్ గణేష్, జాదవ్ అజయ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జైనూర్ మండలం లింగాపూర్ గ్రామంలో విధులను నిర్వర్తిస్తున్న ఏఎస్సై నైతం నారాయణ ఈ సంవత్సరం జూలై 11న అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎలాగైనా ఆదుకోవాలనే ఉద్యేశంతో తన తోటి మిత్రుడు బ్యాచ్ సభ్యుడు బాధిత కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 1989 పోలీసు బ్యాచ్‌కు సంబంధించిన పోలీసు మిత్రులు కలిసి రూ.50వేలను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం చేతుల మీదుగా భార్య సుశీల, కొడుకు ప్రవీణ్‌లకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ఎలాంటి సహాయ సహకారమైనా అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలను వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్టు లైజన్ అధికారులు సయ్యద్ తాజుద్దీన్, ఈశ్వర్‌సింగ్, రాఘువేంద్ర, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్సై సుభాష్, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



**నవతెలంగాణ-ఉట్నూర్**

గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం రాంజీ గోండు గ్రామానికి చెందిన మాణికుమార్ తనకి ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. ఉట్నూర్‌కు చెందిన రాధా తనకు హోటల్ కొరకు లోన్ ఇప్పించమని, హాజీపూర్ మండలం పెద్దమ్మ పేట్ గ్రామానికి చెందిన సరోజ తనకు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కాళోజి నారాయణ రావు జయంతి సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో కార్యాలయం సిబ్బందితో కలిసి కాళోజి చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రజావాణిలో డాక్టర్ మనోహర్, ఎస్‌డీసీ గంగాధర్, ఏఓ దామోదర్, సందీప్ కుమార్, జెడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



**నవతెలంగాణ-నార్నూర్**

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర సభ్యుడు ఝాడే నాందేవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అమృత్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. అంతక ముందు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా చాలిచాలని వేతనాలు తీసుకుంటూ, బడి పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. కనీస వేతనంతో పాటు వంట సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించినవారిలో మధ్యాహ్న భోజన కార్మికులు ఝాడే తాయిబాయి, చాంద్‌బి, రేణుకాబాయి, మైను, శివబాయి, సులోచన బాయి, కుమ్ర లక్ష్మిబాయి, స్రవంతిబాయి, జమున బాయి, జైతుబాయి, మెస్రం పిరాజీ ఉన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



**నవతెలంగాణ-సారంగాపూర్**

మండలంలోని కౌట్ల(బి) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఎన్ఎంఎంఎస్ పరీక్ష స్టడీ మెటీరియల్‌ను హిందీ ఉపాధ్యాయురాలు అరుణకుమారి అందించారు. సొంత డబ్బులతో కొనుగోలు చేసి విద్యార్థులకు అందించి ఉదారత చాటుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పొందేందుకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, అశోక్, వేణుగోపాల్, కవిత, సునిత, మానస గ్రామస్తులు పాల్గొన్నారు.

## నోటితో విషం తీసి విద్యార్థిని రక్షించి..!

- పాము కాటేసిన విద్యార్థిని కాపాడిన ఉపాధ్యాయుడు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి

**నవతెలంగాణ-తాంసి**

బడిలో చదువుకుంటూ ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో పాము కాటేసింది. వెంటనే విద్యార్థికి పాము కాటేసిన విషయాన్ని గుర్తించిన ఉపాధ్యాయుడు విద్యార్థి ప్రాణాన్ని కాపాడారు. పాము కాటేసిన స్థలాన్ని గుర్తించి నోటితో విషాన్ని తీసి ఆపద్బాంధవుడిగా నిలిచాడు. భీంపూర్ మండలంలోని ధనోర ప్రభుత్వ పాఠశాలలో జస్వంత్ అనే విద్యార్థి ఒకటో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం భోజనానికి అందరు విద్యార్థులతో కలిసి వరండాలోకి వచ్చాడు. వరండాలో ఉన్న టైల్స్ ల కింద దాగి ఉన్న పాము విద్యార్థిని కాటు వేసింది. కాటువేసి మళ్లీ టైల్స్ ల కిందికి వెళ్లిపోయింది వెంటనే ఉపాధ్యాయులు గమనించి రెండు పాము ఘాట్లను గుర్తించారు. సురేష్ అనే ఉపాధ్యాయుడు తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా కాటు వేసిన గాట్లపైన ఒక కట్టు కట్టి నోటితో విషాన్ని తీసి వేశాడు. అనంతరం భీంపూర్ ప్రాంత ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్ తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థికి చికిత్సలు కొనసాగించారు. విద్యార్థికి ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారు. వెంటనే స్పందించి విషాన్ని తీసివేసిన ఉపాధ్యాయుని డాక్టర్లతో పాటు తోటి సిబ్బంది అభినందించారు. అంతకుముందు పామును గుర్తించి చంపేశారు.



పాము విషాన్ని నోటితో తీసిన ఉపాధ్యాయుడు


## ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీగా గుర్తించాలి

**నవతెలంగాణ-తాంసి**

ఆదివాసీ గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని కోరుతూ సోమవారం తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆదివాసీ గిరిజనులు రాయిసెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీలతో వచ్చి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాయి సెంటర్ మేటి ఆన్ను పటేల్ మాట్లాడుతూ తాంసి, భీంపూర్ మండలాల్లో 100శాతం నివసిస్తున్న గిరిజన కుటుంబాలు ఉన్నాయని అన్నారు. కేవలం తాంసి మండలంలోని అంబుగాం గ్రామం మాత్రమే ఏజెన్సీగా గుర్తింపు ఉందన్నారు. మిగతా గ్రామాలను సైతం ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతం లేని కారణంగా అమాయక గిరిజనుల ఆస్తులను భూములను, మాయ మాటలు చెప్పి ఇతర కులాలకు చెందిన వారు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. వెంటనే ప్రభుత్వాలు కల్పించుకొని గిరిజన ప్రాంతాలను గూడెలను సర్వే చేయించి, మా గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తింపు నివ్వాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజనులు తొడసం సంబు, మెస్రం లక్ష్మణ్, భీంరావ్, భరత్, కుడిమెత సంగీత్, మారుతి, గంగాధర్, రమేష్, నాగోరావ్, వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజన నాయకులు ప్రజలు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎస్ఆర్ విద్యార్థి సుకీర్తి





**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్- 11 బాలబాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలను ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్. స్వామి వెల్లడించారు. బాలికల విభాగంలో ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థి అంబటి సుకీర్తి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, రెండు, మూడు స్థానాల్లో శన్విత, అక్షర వీణ నిలిచారని పేర్కొన్నారు. బాలురుల విభాగంలో ఫస్ట్ ప్లేస్‌లో డీ. రుద్ర కేదార్ రెండు, మూడు స్థానాల్లో ఎస్ శ్రీజన్, అయాన్‌లు నిలిచారన్నారు. ప్రతి జిల్లా నుంచి నలుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి పంపాలనే ఆదేశాలతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నవారితో పాటు నాలుగో స్థానంలో ఉన్న వారిని సైతం రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు, దానికి సంబంధించిన జాబితాను విడుదల చేసినట్లు స్వామి వెల్లడించారు. ఎంపికైన వారు ఈనెల 14 నుండి తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం పట్టణంలోని సెంట్రల్ గార్డెన్స్‌లో హిందూ ఉత్సవ సభ్యులు, గణపతి నవరాత్రి ఉత్సవ మండప సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని దానిని ప్రతి ఒక్కరు కృతనిశ్చయంతో కొనసాగించాలని తెలిపారు. గణపతి మండపాల వద్ద 24 గంటలు సభ్యులు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. వీలైతే గణపతి మండపాల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి సమయాల్లో జంతువులు ప్రవేశించకుండా అడ్డును ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే ముందస్తు జాగ్రత్త చర్యల్లో తగినంత నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, అదేవిధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు 11 సెక్టర్లుగా విభజించి ప్రతి సెక్టార్‌కి ఎస్ఐ స్థాయి అధికారిని నియమించడం జరిగిందని, పట్టణంలో నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కి సీఐ స్థాయి అధికారిని నియమించి, డీఎస్పీలు, అదనపు ఎస్పీ, ఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణతో ప్రతిరోజు గస్తీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదనంగా 12 పుట్ పెట్రోలింగ్ పార్టీలను నియమించామన్నారు. సాయంత్రం సమయాలలో ప్రత్యేకంగా ఎక్కువగా గస్తీ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటామని తెలియజేశారు. నిమజ్జనం సమయంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేకంగా చర్యలు చేపడుతామన్నారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ పుకార్లను నమ్మొద్దని సూచించారు. పోలీసుల చర్యలు తీసుకునే అంతవరకు సంయమనం పాటించాలని, ఎలాంటి సమాచారాన్ని అయినా జిల్లా పోలీసు యంత్రాంగానికి అందజేయాలని, జిల్లా పోలీసు యంత్రాంగం తగిన చర్యలను తీసుకుంటుందని సూచించారు. అత్యవసరమైన సమయాలలో స్పందించేందుకు ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు సమాచారం అందించేవారు 8712659906కు తెలియజేయలన్నారు. గణపతి నిమజ్జన ప్రదేశాల మధ్య ప్రత్యేకంగా మహిళ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిమజ్జనం నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ఫణిధర్, ప్రణయ్ కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు ముజాహిద్, విష్ణువర్ధన్, హిందూ ఉత్సవ సభ్యులు బొంపల్లి హనుమండ్లు, సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు ప్రమోద్ కుమార్ కత్రి, పెద్దలు కమల్ కిషోర్ అగర్వాల్, గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**నవతెలంగాణ-నార్నూర్**

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆశాలకు పీహెచ్‌సీ వైద్యులు జితేందర్ రెడ్డి, రాంబాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఆశాలకు వర్షాకాల వ్యాధులపై చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై అవగాహన కల్పించారు. ప్రణాళిక ప్రకారం ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. గర్భిణులకు నెల నెలా వైద్య పరీక్షకు తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ తులసిదాస్, పీహెచ్ఎన్ఓ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్లు చౌహాన్ చరణ్‌దాస్, సతవ్వ, గణేష్ కుమారి, వైద్య సిబ్బంది హిమబిందు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com

## ఫిజియోథెరపీపై ఉపాధ్యాయులకు అవగాహన

నవతెలంగాణ-కౌటాల



ఫిజియోథెరపీపై ఉపాధ్యాయులకు డాక్టర్ మహేష్ సోమవారం కౌటాల మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగేల ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గావుడె హనుమంతు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు గంధం ప్రకాష్, దేవన్న, లాలాజీ, కుమార్ పాల్గొన్నారు.

## సింగరేణి లాభాల్లో వాటా కేటాయించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటాను కేటాయించాలని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షుడు రాయుల నరసయ్య, బ్రాంచి కార్యదర్శి చల్లూరి అశోక్ అన్నారు. సోమవారం గోలేటిలో నిర్వహించిన సమావేశంలో ఆయన వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన లాభాల్లో వాటాని కేటాయించాలని కోరారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు బాగు పడతాయని అనుకున్నామన్నారు. కానీ ఎటువంటి లాభాలు ఆశించకుండా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటికైనా సింగరేణిలో వచ్చిన లాభాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ సాగర్ గౌడ్, జంగపల్లి శంకర్, మస్కు తిరుపతి, మెకార్తి సుగుణాకర్, రాజశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

## నిమజ్జన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

వినాయక నిమర్జన కార్యక్రమాన్ని మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జనంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వినాయక మండపాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి మండపాల వద్ద ఎలాంటి సంఘటన జరగకుండా ప్రతి అధికారి పర్యవేక్షించాలన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఆయా వినాయక మండపాల సహాయకులను సంప్రదించి వారితో మాట్లాడి ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశములో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్సై కమలాకర్, ఆర్ఐ మోహన్, పంచాయత్ సెక్రటరీ తిరుపతి, సిర్పూర్ మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పోశం పాల్గొన్నారు.

## పీఆర్సీ ప్రకటించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు గుండు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగండి పల్లి రాకేష్ వ్యవహరించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తంగాడిపెల్లి రాకేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాటి విజయనిర్మల, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు గంగాభవాని, ఉదయ్ కిరణ్, ఆత్మరావ్, షాహేబ్ ఉపేంద్ర, అర్శియా పాల్గొన్నారు.

## మంచిర్యాల మీదుగా ఆదిలాబాద్‌కు బస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న జైనూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఆ వైపుగా వెళ్లే బస్సులను పోలీసుల సూచనల మేరకు ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. దీంతో జిల్లా కేంద్రం నుండి ఆదిలాబాద్ వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ ప్రత్యేక చొరవ తీసుకొని మంచిర్యాల మీదుగా ఆదిలాబాద్ వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరుగా ఆదిలాబాద్ వెళ్లే వారికి అనుకూలంగా ఉంటుందని, దీనిని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

## నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

నవతెలంగాణ-రెబ్బెన

వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే జాగ్రత్తలుపాటిస్తూ బయటికి వెళ్లాలన్నారు. భారీ వర్షాలకు కుమురం భీం, వట్టివాగు ప్రాజెక్టులు గేట్ల ద్వారా నీళ్లు వదిలి వేయడం జరుగుతుందన్నారు. వాగులు, నదులు, అటవీ ప్రాంతంలో పర్యటన చేయొవద్దని, చేపల వేటకు ఎవరు కూడా వెళ్లొద్దని, పశువులను కూడా తిరగనివ్వదన్నారు. అదే విధంగా శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని కోరారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు.

## ఇంటర్‌నెట్ సేవలు లేక పరేషాన్

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఇంటర్‌నెట్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారస్తులు, మీసేవా, బ్యాంకులో లావాదేవీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని చాలా రేషన్ షాపుల్లో కూడా ఇంటర్‌నెట్ సేవలు లేకపోవడంతో ఇప్పటివరకు కొందరు డీలర్లు బియ్యం ఇవ్వకపోవడంతో బియ్యం కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెట్ సౌకర్యం లేకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీ నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## గుర్తింపు సంఘం పత్రం పొందిన ఏఐటీయూసీ

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన గుర్తింపు పత్రాన్ని ఏఐటీయూసీ నాయకులు హైదరాబాద్‌లో పత్రాన్ని తీసుకున్నారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి సెంట్రల్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కే.రాజకుమార్‌తో కలిసి తీసుకున్నారు. ఇక నుంచి కార్మిక సమస్యలపై గుర్తింపు సంఘంగా ఉద్యమాలు నిర్వహించి సాధిస్తామన్నారు.

# జోరుగా కోడి పందెం..జూద క్రీడలు

- పండుగలు రాగానే విచ్చలవిడిగా నిర్వహణ
- జిల్లాలో పలుచోట్ల పోలీసుల దాడులు..
- పలువురిపై కేసులు నమోదు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కోడి పందేలను, జూదాన్ని నిర్వహించకూడదని న్యాయస్థానాలు ఆదేశించినా.. అవి కేవలం ఆదేశాలకే పరిమితమవుతున్నాయి. ప్రతి ఏటా రైతులు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పొలాల అమావాస్య, బొడగా పండగపూటను ఆసరా చేసుకుని మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కుమురంభీం జిల్లాలోనూ పందెం రాయుళ్లు పందెలను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి నిర్వాహకులను పట్టుకున్న సంఘటనలున్నాయి. పలువురిని అదుపులోకి తీసుకున్న వారిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

**జోరుగా జూదం, కోడి పందెలు**

జిల్లా వ్యాప్తంగా కోడి పందెలు, జూదం క్రీడాలను యాధేచ్ఛగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని చింతలమానేపల్లి మండలం మహారాష్ట్రకు సరిహద్దున ఉండటంతో ఇక్కడ క్రీడాలను కొనసాగిస్తున్నారు. వారం పది రోజుల నుండి పందెం పుంజులను వారి గుప్పెట్లో పెట్టుకుంటారు. పండుగను పురస్కరించుకున్న మరుసటి రోజునే పందెంరాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక పేకాట, కోడి పందేల స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు.

**పోలీసుల దాడులు**

కోడి పందెలు జోరుగా కొనసాగుతున్నాయని పోలీసులకు ఇటీవల మండలంలోని బాలాజీ అనుకొడ, కర్జెల్లి, ఆడేపల్లి గ్రామ సరిహద్దు ప్రాంతాల్లో ఆడుతున్నట్టు సమాచారం అందింది. గత సోమ, మంగళవారాల్లో కోడి పందెల కోసం ఏర్పాటు చేసిన స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 20 మంది పందెం రాయుళ్లపై కేసులు నమోదు చేసి 14 కోడిపుంజులు, 35 కోడి కత్తులు, రూ.5000 నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కోడి పందెల నిర్వహణ జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్నా ప్రస్తుతం ఈ సంప్రదాయం పల్లెలకు సైతం



ఇటీవల పట్టుకున్న కోడి కత్తులు

విస్తరించింది. ఈ పందేల్లో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారింది. సాధారణంగా పోటీలకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన జాతులకు చెందిన కోడి పుంజులను మాత్రమే వినియోగిస్తారు. వాటి ధర కూడా రూ.వేలల్లో ఉంటుంది. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని రహస్య ప్రాంతాల్లో పేకాట కేసులు వెలుగులోకి వచ్చాయి. కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లో పేకాట జోరుగా ఆడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఈ వ్యసనానికి బానిసలుగా మారి ఇళ్లు గుళ్ల చేసుకుంటున్నారు.

**రహస్య స్థలాలలో..**



చింతలమానేపల్లిలో కోడి పందెం నిర్వహిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

కోళ్ల పందెలను నిర్వాహకులు పక్కా ప్లాన్‌తో నిర్వహిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా జనసంచారం అంతగా లేని స్థలాలను గుర్తించి స్థానికుల సాయంతో ముందుగా పరిశీలన చేపడుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లను ఒకచోటుకు తీసుకొచ్చి ఆ ప్రాంతంలోకి ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రూ.10 వేల నుంచి మొదలు రూ.లక్షల్లో పందేలు కాస్తారు. జిల్లాలో ఏటా పొలాల అమావాస్య, బొడగా, సంక్రాంతి పండుగకు భారీ ఎత్తున కోడి పందేలు, పేకాట జరుగుతున్నా నిందితులపై నామమాత్రపు కేసులు మాత్రమే నమోదవుతున్నాయి. కోడి పందేలపై ప్రభుత్వ నిషేధం ఉండటంతో నిందితులపై జంతు హింస నిరోధక చట్టం 1960 ప్రకారం సెక్షన్ 11 కింద కేసులు నమోదు చేస్తారు.

**ఇటీవల జూద స్థావరాలపై దాడులు**

ఈ నెల 2న కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూరు కాలనీలో గల ఓ ఇంట్లోని జూదం స్థావరంపై రాత్రి పోలీసులు దాడి చేసి రూ.43 వేల నగదు స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. 3న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ శివార్లో జూదర స్థావరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వాంకిడి మండలంలోని ఖమాన గ్రామ శివారులో పోలీసులు జూదం ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి, ఘటన స్థలంలో రూ.3200 స్వాధీనం చేసుకున్నారు. సిర్పూర్(టి) మండలంలోని పారిగాం గ్రామంలో జూదం ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని, వారిపై కేసు నమోదు చేసి, వారి వద్ద రూ.17000 నగదు జప్తు చేసుకున్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల లక్ష్యాల సాధనలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌ను నియమించినందున డివిజన్‌లో జరిగే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులలో అధికారులు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మంచినీటి బావులు, నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. గ్రామాలలో విష జ్వరాల నియంత్రణపై పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనుమానితుల నుండి రక్త నమూనాలు సేకరించి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో ముందుకు తీసుకువెళ్లాలని, జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్న భోజన కార్మికులకు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కాంతమ్మ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కాంతమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ మాట్లాడుతూ 25 సంవత్సరాల నుండి మధ్యాహ్న భోజనం కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పాఠశాలలో పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. కానీ ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, వంట కార్మికులకు ఉద్యోగ భద్రతకు జీఓ విడుదల చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం బోనస్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వేతనం చెల్లించే విధంగా జీఓ విడుదల చేయాలని, మెనూ చార్జీలు ధరలకు అనుగుణంగా ఇవ్వాలని, కోడిగుడ్లు, గ్యాస్, వంట సరుకులు ప్రభుత్వమే ఇవ్వాలని, పెండింగులో ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి కోశాధికారి ఆశక్క, మధ్యాహ్న భోజనం కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు ఇచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరించినప్పుడే అధికారులకు గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని**

బెజ్జూర్ మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన చౌదరి సురేష్ బెజ్జూర్ ప్రాథమిక సహకార సంఘంలో రుణం పొందకపోయిన తీసుకున్నట్లుగా చూపుతుందని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన దహగాంకార్ హీరామన్ తన తండ్రి పేరిట గల భూమిని తన పేరిట విరాసతో చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

చింతలమానేపల్లి మండలం రుద్రపూర్ గ్రామానికి చెందిన దుర్గం శంకర్ తాను బెజ్జూర్ సహకార బ్యాంకులో రుణం పొందకపోయిన తీసుకున్నట్లుగా చూపుతోందని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ ధరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన నికాడి లక్ష్మీబాయి తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నూతన పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో 55 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకొని ఉన్నామని, కొందరు ఈ భూమిని అక్రమంగా పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన గడిల మల్లయ్య, గడిల శంకర్ తమ తల్లి పేరుతో ఉన్న భూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం పులికుంట గ్రామానికి చెందిన మొడెం సుజాత జాతీయ రహదారి నిర్మాణంలో తనకు రావాల్సిన నష్టపరిహారాన్ని వేరొకరు అక్రమంగా పొందారని, ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన పబ్బాల బాపు తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేస్తున్నారు.

## సీహెచ్‌సీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, పేషంట్ కేర్ కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీఓ నెంబర్ 60 అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏరియా ఆస్పత్రుల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.15000 ఉందని, జిల్లా కేంద్రంలో మాత్రం రూ.12000 ఇవ్వడం సరైనది కాదన్నారు. మూడు నెలలుగా కార్మికులకు సదరు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని దీంతో కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేష్, సత్తార్, గుణవంతరావు, మమత పాల్గొన్నారు.

## పండ్ల తోటల ఏర్పాటుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నూతన పండ్ల తోటల ఏర్పాటు కోసం ఆసక్తిగల రైతుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీకృత ఉద్యానవన పథకంలో భాగంగా అరటి, బొప్పాయి, మామిడి పంటలు పండించేందుకు సిద్ధంగా ఉన్న నూతన రైతులకు మూడు సంవత్సరాల పాటు రాయితీ ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాల కోసం ఆసిఫాబాద్ డివిజన్ రైతులు అబ్దుల్ నదీం నెంబర్ 8977713964, కాగజ్‌నగర్ డివిజన్ రైతులు సుప్రజ 8977713965 నెంబర్ సంప్రదించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com

## ఫొటోగ్రాఫర్లకు ఆర్థిక సాయం

**నవతెలంగాణ-లక్షెట్టిపేట**



ఖమ్మంలో మున్నేరు వరదల వల్ల చాలామంది ఫొటోగ్రాఫర్లు రూ.లక్షల విలువైన కెమెరాలు, కంప్యూటర్లు నష్టపోయారు. మండలం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.15,500 విరాళాలు సేకరించి ఖమ్మం జిల్లా అసోసియేషన్ కోశాధికారి కెఎస్. బాబాకి కార్యవర్గ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడియో గ్రాఫర్ అండ్ కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామిండ్ల సురేష్, కోశాధికారి తోట రవి, గౌరవ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మల్లేష్, సభ్యులు రవి, సాయి కృష్ణ, భీమేష్, రాంబాబు, నాగబాబు, సతీష్, చందు, సుమన్, ప్రశాంత్, ప్రవీణ్ కుమార్, శివకుమార్, సురేష్ కుమార్, తిరుపతి, రాజేంద్రప్రసాద్, మొగిలి పాల్గొన్నారు.

## తెలంగాణ తొలిపొద్దు ప్రజా కవి కాళోజీ

**నవతెలంగాణ-జైపూర్**



జీవితాంతం తెలంగాణ ఉద్యమంలో కొనసాగిన తెలంగాణ తొలి పొద్దు ప్రజా కవి కాళోజీ నారాయణ రావు అని తహసీల్దార్ వనజా రెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సోమవారం తహసీల్దార్ కార్యాలయం అధికారులతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాడిన కాళోజీ ప్రజావాది అని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు



**నవతెలంగాణ-వేమనపల్లి**

అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్ హెచ్చరించారు. సూరారం గ్రామానికి చెందిన కొరకొప్పుల చంద్ర గౌడ్, కుడిమేత రాజు, తలండి సురేష్, దుర్గం శ్రీను, కుడిమేత మధునయ్య అటవీ ప్రాంతంలో 33 కేవీ పవర్ లైన్‌కు కరెంటు వైర్‌తో సరఫరా ఇచ్చి అటవీజంతులను వేటాడుతున్నారని సమాచారం మేరకు సోమవారం వారిని అదుపులోకి తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమ కరెంటు కనెక్షన్‌తో అడవీ జంతువులను వేటాడిన, చంపిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవులలో ఆవులు, పశువులు, మనుషులు, పోలీసు కూంబింగ్ ఆపరేషన్‌కు రాత్రి వేళలో అడవిలో తిరుగుతుంటారని ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అడవులలో వేట మానుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వర్షంలో పారిశుధ్య పనులు

**నవతెలంగాణ-తాండూర్**

మండలంలోని తాండూరు, కాసిపేట, అచలాపూర్ గ్రామపంచాయతీలో సోమవారం ఎంపీఓ అనిల్ వర్షంలో సైతం సైతం పారిశుధ్య పనులను పర్యవేక్షించార. ముసురు వర్షాలకు విష జ్వరాలు ప్రబలే అవకాశాలుందున పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని కోరారు. తాగునీటి పైప్‌లైన్ లీకెజీలను సరిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులను చేయించాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్ననేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మురుగు కాలువల్లో రోడ్ల పైన నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. దోమలు, ఈగల ద్వారా ప్రజలు వ్యాధుల భారిన పడే అవకాశమున్నందున దోమల నియంత్రణకు స్ప్రే చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దివాకర్, భీమయ్య, కల్పన, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో పూజలు నిర్వహించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్
- మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



**నవతెలంగాణ-మంచిర్యాల**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని చింతపండువాడ ఏరియా సిద్ధి వినాయక, 100 ఫీట్ రోడ్ గణేశ్ మండపంతో పాటు ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆదివారం రాత్రి సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహకులకు పలు సూచనలు చేశారు. పోలీసు శాఖ ఇచ్చిన నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యలుంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. నిమజ్జనం రోజు తీసుకోవాల్సిన నిబంధనలు, ఆంక్షలు పాటించాలన్నారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. బందోబస్తు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని, మండపం వద్ద ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌లను చెక్ చేయాలని పోలీసులకు సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్ ఉన్నారు.

**గణేష్ మండపంలో పూజలు చేసిన సీపీ**

ఆధ్యాత్మిక వాతావరణంలో గణేషుని పూజలు నిర్వహించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చున్నం బట్టి వాడలో అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రియల్ ఎస్టేట్స్ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐలు బన్సిలాల్, అశోక్, అంజనీపుత్ర ఎండీ పిల్లి రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, సదానందం, డైరెక్టర్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందిస్తాం : ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**నవతెలంగాణ-మంచిర్యాల**

జిల్లా ప్రజలు అత్యవసర చికిత్స, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా జిల్లాలోనే కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు చేరి మాత శిశుకేంద్రానికి వరద ముంపు ఉండడంతో అక్కడ ఉన్న గర్భిణులను మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌ను సందర్శించారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణుల వార్డ్, తలసేమియా పిల్లల వార్డ్‌ను సందర్శించారు. ఫార్మసీ, ఓపీ రూమ్స్‌ను చూసి విషయాలను తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌కు వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. హాస్పిటల్ వార్డుల్లో పై కప్పు పెచ్చులు ఉడడం, నీరు కారుతుండడంతో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదికారులకు సూచించారు. సరిపడ బెడ్లు, సిబ్బంది లేకున్న రోగులకు, గర్భిణులకు వెనుకడుగు వేయకుండ వైద్యం అందిస్తున్న హాస్పిటల్ సిబ్బందిని, అదికారులను అభినందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరీష్ చంద్ర రెడ్డి, ఆర్ఎంఓలు శ్రీమన్నారాయణ, శ్రీధర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, వైస్ చైర్మెన్ సల్ల మహేష్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య

**నవతెలంగాణ-జైపూర్**

తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు.. సీపీఎం నాయకురాలు నాగజ్యోతి అధ్యక్షతన చెన్నూర్ మండల శాఖ మహా సభ సమావేశం సోమవారం నిర్వహించారు. దీనికి ముందు పతాకావిష్కరణ అనంతరం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించుకునే మండల శాఖ మహాసభలో గతంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలతో పాటు భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గల అర్హులైన పేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు రూ. 5 లక్షల నగదుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, మహాలక్ష్మి పథకం ఆధార్ కార్డుకు సంబంధం లేకుండా గృహజ్యోతి అమలు చేయాలని అన్నారు. విష జ్వరాల నుండి రాష్ట్ర ప్రజలను కాపాడాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు కూలీ రేటు పెంచాలని, విద్య, వైద్యం పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మురికివాడల్లో రోడ్లు కాలువల నిర్మాణం చేపట్టాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, మండల కార్యదర్శి రవి, నాగజ్యోతి, సమ్మక్క, కరీమా, బోన్ల సరిత, యామిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ళ ఆశయ్య

## ఘనంగా అక్షరాస్యత వేడుకలు



**నవతెలంగాణ-మంచిర్యాల**

58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పట్టణంలోని గర్మిళ్ల పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఏ.పురుషోత్తం హాజరై విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. వయోజనులకు, నిరక్షరాస్యులకు విద్య నేర్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరక్షరాస్యత నిర్మూలనకు అధిక నిధులు వెచ్చించి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షులు బాల మోహన్, ప్రొగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కే.భీంరావ్, కార్యదర్శి చంద్రమౌళి, సీనియర్ మెంబర్స్ వినయ్ కుమార్, కొత్త సురేందర్, పోకల వెంకటేశ్వర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

## చెరువు భూములను కాపాడాలి



**నవతెలంగాణ-జన్నారం**

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువు, శిఖం, మత్తడికి సంబంధించిన భూములను కాపాడాలని మండల చెరువుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కమ్మల విజయ్ ధర్మ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న శిఖం చెరువు భూములకు సంబంధించి పత్రాలు, దస్తావేజులను, జిరాక్స్ కాపీలతో కమిటీకి ఇవ్వాలని కోరారు. చెరువులు కబ్జా కాకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు భూమా చారి, ప్రచార కార్యదర్శి మామిడి విజయ్, నాయకులు ఎండీ ఇజాజ్, ఎస్.మహేష్, దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, ఒరే సాయికుమార్, ప్రభంజనం పాల్గొన్నారు.

## గుర్తింపు పత్రాలు పంపిణీ



**నవతెలంగాణ-తాండూర్**

రేచిని గ్రామపంచాయతీలోని రైతు వేదికలో తోటి, కోలాం కులస్తులకు ప్రధానమంత్రి జాతీయ జన ఆదివాసీ న్యాయమహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఓటర్ కార్డులు పంపిణీ చేశామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. రుణమాఫీ దరఖాస్తులు తీసుకోవడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఏటీడీఓ పురుషోత్తం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఈఓ ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి

- బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

నవతెలంగాణ-ముధోల్

శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు జరుపుకోవాలని బైంసా ఎఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గణేష్ మండప నిర్వహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో జీఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. అన్ని కులాలు, మతాలు సమన్వయంతో పోలీస్ అధికారుల నిబంధనలు ఉల్లంఘించకుండా నిమజ్జనోత్సవ వేడుకను జరుపుకోవాలని సూచించారు. మండపం వద్ద విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని అవసరమైతే సంబందిత అధికారుల సహాయం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షులు కోరి పోతన్న, టి.రమేష్, సాయిప్రసాద్, కోశాధికారి సాయినాథ్, వీడీసీ అధ్యక్షుడు జి.నారాయణ, నాయకులు ఎజాజ్, రవి, మండప నిర్వహకులు పాల్గొన్నారు.

## మండల కేంద్రాన్ని విభేదాలు లేకుండా నిర్మిద్దాం

నవతెలంగాణ-నార్నూర్

కుల, మత, వర్గ, లింగ బేధంలో నార్నూర్ మండల కేంద్రానికి విభేదాలు లేకుండా నిర్మిద్దామని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ, ముస్లీం మైనార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో వివిధ వర్గాల ప్రజలు జీవిస్తారని వారికి అండగా నిలవడం తమ బాధ్యత అన్నారు. తారతమ్యాలు లేకుండా శాంతి సామరస్యాలను నెలకొల్పుదామని కోరారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎవరి హక్కులు వారికి లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో మడావి మాన్కు పటేల్, అర్క గోవింద్, మడావి ఆనంద్‌రావ్, తొడసం వినోద్, రాథోడ్ ఉత్తమ్, పుష్కర్ జ్ఞానోబా, నర్సింగ్ మోరే, పెసా కోఆర్డినేటర్ సికిందర్ రాథోడ్, దేవ్‌రావ్ లోఖండే, మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, డిగంబర్ ఆడే, బాలాజీ జాదవ్, కాంతారావ్ దుర్గే, షేక్ దాదే అలీ, దత్తారం రాథోడ్, వసంత్ ఆడే, ఖాజా సెట్, హాసన్ ఖాన్, మహమ్మద్ ఖురేషి, ఫిరోజ్ ఖాన్, సయ్యద్ ఖాసీం, షేక్ మన్ను, షేక్ కౌసర్, బషీర్, రఫిక్, సోహెల్ ఖాన్ పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి, కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుడుం దెబ్బ మండలాధ్యక్షులు పెందూర్ త్రిమూర్తి మాట్లాడుతూ జైనూర్ మండల కేంద్రంలో 1970లో వలస వచ్చిన మైనార్టీల భూయజమాన్య హక్కు పత్రాలు, ఆధార్, రేషన్, కరెంటు బిల్లులు, వాణిజ్య వర్తక, వ్యాపార అనుమతులను రద్దుచేసి ఏజెన్సీ నుంచి ప్రభుత్వమే తరలించాలని, అలాగే జైనూర్ సంఘటనలో ఆదివాసీలపై ఎదురు దాడికి పాల్పడిన మైనార్టీలపై ఎస్సీ, ఎస్సీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మైనార్టీలకు వత్తసు పలికే అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గడువు ప్రకటిస్తున్నమన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే మా చట్టాలను, పంచాయతీరాజ్ విస్తీర్ణ చట్టం (పేసా) ను అమలు పరిచి మావా నాటే మావరాజ్‌ను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు టేకం హరిప్రసాద్, పెందూరు మోతీరాం, జనార్ధన్, తుకారామ్ పాల్గొన్నారు.

## సైన్స్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో తెలంగాణ భాషా దినోత్సవ సందర్భంగా కాళోజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగీత పాల్గొని, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ తెలంగాణ భాష పలుకుబడుల భాష అని తెలిపారు. మన భాషలో తెలంగాణ ఆత్మ ఉంటుందని పేర్కొన్నారు. మన భాషను మనమే గౌరవించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, అధ్యాపకులు అరుణ్ కుమార్, డీఎస్ చక్రవర్తి, రమాకాంత్‌గౌడ్, రవికిరణ్, శ్రావణి, మంజుల, ఆనందం, రాజ్ కుమార్, నరసింగరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



నవతెలంగాణ - కాసిపేట

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి సూచించారు. సోమవారం కాసిపేట పోలీస్ స్టేషన్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, పీస్ కమిటీలతో కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, మండపాల్లో, నిమజ్జనంలో డీజేలను ఏర్పాటు చేయరాదని, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయరాదని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులను నమ్మకూడదన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు సంబంధించిన నేతలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ముస్లిం పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు పెడితే చర్యలు

నవతెలంగాణ-బోథ్

రైతులు తమ పంట పొలాల్లో అంతర్ పంటగా గంజాయి సాగు చేస్తూ పంట రక్షణకు విద్యుత్ షాక్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోథ్ సర్కిల్ పరిధిలోని బోథ్, బజార్‌హత్నూర్ మండలాల్లో రైతులు తమ పంట పొలాల్లో పంట రక్షణకు అడవి జంతువుల నుండి పంట రక్షించుకొనేందుకు విచ్చలవిడిగా విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇలా ఏర్పాటు చేయడం సరైనది కాదన్నారు. బజార్‌హత్నూర్ మండలంలోని గోకొండ, ధాబా, గ్రామాల రైతులు గంజాయి సాగు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై అప్పారావు సిబ్బందితో కలిసి దాడులు చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. పంట పొలాలలో గంజాయి సాగు చేస్తూ పంట రక్షణకు విద్యుత్ షాక్ ఏర్పాట్లు చేస్తే వారిపై కేసులు పెడుతామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముధోల్

పీఆర్టీయూ మండల మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, టీవీ రమణరావులు తెలిపారు. మండల అధ్యక్షులుగా పి. ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ ఆహాద్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ వసంత్ రావు, మహిళా ఉపాధ్యక్షులుగా యోగిత, కార్యదర్శిగా డి. శ్రీనివాసులు ఎన్నికైనట్లు ప్రకటించారు. అంతకుముందు సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉత్తమఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్, రవీందర్, బసవరాజు, మోహినోద్దీన్, జనార్ధన్ పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీ చేసిన కృషి మరువలేనిది




నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఉద్యమంలో ప్రజాకవి కాళోజీ చేసిన కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 110వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తన రచనలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజానీకానికి ఉద్యమ పాఠాలు నేర్పిన గొప్ప వ్యక్తి కాళోజీ అని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, భారత స్వాతంత్ర్యోద్యమం, ఆనాటి నిజామ్ నిరంకుశ పాలనకు వ్యతిరేఖంగా ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. కాళోజీ జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. దీనివల్ల మహనీయుల చరిత్రను నేటి తరాలకు అందించినవారిమవుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ రాజేందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఏఓ అంజి ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ ఆధ్వర్యంలో...**

ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జయంతి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ కౌన్సిల్ సభ్యులతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గండ్రత్ రమణ, ఎస్పీ రాజు, బిట్లింగ్ నవీన్, సాజిద్, అడప విజయలక్ష్మి పోశెట్టి, అదుముళ్ల రమాదేవి పద్మాకర్, ముజాయిద్ చౌస్, నాయకులు పూదరి రాజన్న, పూదరి రంజిత్, గంధం సుధాకర్, సిరికొండ రమేష్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌టౌన్** : తెలంగాణ యాసను పరిచయం చేసిన మహా కవి కాళోజీ నారాయణరావు అని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాళోజీ జయంతిని పురస్కరించుకోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధు, తెలంగాణ యాసను కించపరిచిన వారికి తన కవిత్వాల ద్వారా సమాదానం చెప్పిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటులో ఆయన కృషి ఉందన్నారు. నిజాం సర్కార్‌తో పోరాడి ఉనికి చాటారన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, డీడబ్ల్యూఓ సబిత ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**లోకేశ్వరం** : ప్రజాకవి అక్షర యోధుడు కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా మండలంలోని మన్మద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మల్యాగౌడ్, కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి రచనలు, బాల్యం, విద్యాభ్యాసం తెలంగాణ ఉద్యమాలలో ఆయన పాత్ర, తెలంగాణ యాస, గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఉపాధ్యాయులు మల్యాగౌడ్‌ను పాఠశాల బృందం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, దేవేందర్, రాజేందర్‌రెడ్డి, నవీన్ కుమార్, రమాదేవి, విజయ కుమారి, సౌజన్య, గోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు

**నేరడిగొండ** : మండల కేంద్రంలోని కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు రాఘవరావు ప్రసంగిస్తూ పుట్టుక నీది చావు నీది దేశానికి అన్నట్టుగానే జీవితాన్ని ధార పోసి కాళోజీ నారాయణరావు కవితల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్య పరిచారు. నిజాన్ని నిర్భయంగా వెన్నుతో పోరాటాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది నాగోరావుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకుల బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌టౌన్** : పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా కాళోజీ నారాయణరావు జయంతిని తెలుగు విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జరుపుకున్నారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. తెలుగు విభాగాధిపతి రేఖ మాట్లాడుతూ కాళోజీ గురించి ఉద్యమస్ఫూర్తి గురించి, విద్యార్థులకు వివరించారు. విద్యార్థి శ్రీవల్లి కాళోజీ పలుకుబడుల గురించి వివరించింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, ఎన్ఎస్ఎస్ పీఓ పృథ్వీరాజ్, సమీర్, అనిత, సంతోషిని, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

**జూనియర్ కళాశాలలో...**

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురలో శ్రీ కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాళోజీ నిజం పాలనకు వ్యతిరేకంగా, ఇతర ప్రజా ఉద్యమాలలో అతని పాత్ర ఉందని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరెడ్డి, సుధాకర్, ప్రభావతి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసు కార్యాలయంలో...**

కాళోజీ నారాయణరావు చేసిన కృషి అనిర్వచనీయమని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, భాషాభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి కాళోజీ నారాయణరావు అని అన్నారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు భాషా అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు, మరాఠీ, ఉర్దూ, హిందీ భాషల నందు సాహిత్యాన్ని రచించిన వ్యక్తి కాళోజి నారాయణరావు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, పోలీసు కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లాద్, సీసీ దుర్గం శ్రీనివాస్, అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ వెంకటి, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, సిబ్బంది పోతరాజు, రమణ, పద్మ, ప్రసాద్, సత్యనారాయణ, ఆశన్న, పోలీసు ముఖ్య కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**తలమడుగు** : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, మండల సూపరింటెండెంట్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ నగేష్, జూనియర్ అసిస్టెంట్ ఉమా, ఈజీఎస్ ఏపీఓ మేఘమాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు, వినోద్‌రెడ్డి, మేకల మురళీధర్, చంద్రమ్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉట్నూర్** : ఉట్నూరు సాహితీ వేదిక అధ్యక్షుడి నివాసంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు 110వ జయంతిని పురస్కరించుకొని, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఉట్నూర్ సాహితీ వేదిక బృందం కాళోజీ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు జాదవ్ బంకట్‌లాల్, ప్రధాన కార్యదర్శి ముంజం జ్ఞానేశ్వర్, కోశాధికారి డా.ఇందల్‌సింగ్ జాదవ్, కవులు భట్టు శ్రీ మురళి, సాహిత్య ప్రేక్షకులు మహేందర్, శ్రీసేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చవాన్ సేవాదాస్ పాల్గొన్నారు.

**తాంసి** : తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి, ప్రజలను చైతన్య పర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని పలువురు కొనియాడారు. కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. మహా కవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ దారవేణి రాఘవేంద్ర, సిబ్బంది స్రవంతి, వినోద్, లలిత, అశోక్, అడెల్లు, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.

**జన్నారం** : ప్రజాకవి కాళోజీ నారాయణరావును ఆదర్శంగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపీడీఓ శశికళ, తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి అన్నారు. కాలోజీ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ యాస, భాష ప్రాముఖ్యతను పెంచిన మహాకవి కాలోజీ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు. అదే విధంగా కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఇంధన్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

**కాసిపేట** : మండలం దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా దినోత్సవం పురస్కరించుకొని కాళోజి నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సామాజిక చైతన్య వేదిక నాయకులు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలలో ప్రథమ ద్వితీయ పోటీలలో గెలుపొందిన ప్రీతి కుమారి, దీక్ష, మహిమలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేష్ బాబు, ఉపాధ్యాయులు అంజాద్ పాషా, లచ్చన్న, రమణయ్య సులోచన, పద్మ, కుమారి, రజిత, రాజేష్ పాల్గొన్నారు.










# 'ఆదివాసులపై కేసులు పెట్టడం సరైంది కాదు'




నవతెలంగాణ-ఉట్నూర్

జైనూర్ సంఘటనలో ఆదివాసీ గిరిజనులపై పోలీసులు కేసులు పెట్టడం సరైంది కాదని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు, భారత్ మహాసభ జిల్లా అధ్యక్షురాలు పెందూరు ప్రియాంక అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జైనూరు సంఘటన బాధాకరమన్నారు. ఏజెన్సీ చట్టాలు అమలు చేయకపోవడం వల్లనే బయటివారు ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి అమాయక గిరిజనులపై దాడులు చేస్తున్నారన్నారు. ఆదివాసీ మహిళపై అత్యాచార యత్నం చేసి దాడి చేసిన వ్యక్తిని ఉరితీయాలన్నారు. ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంతంలో ఒక వర్గం వారు ఆదివాసీ మహిళలను లొంగదీసుకొని వందలాది మందిని పెళ్లిళ్లు చేసుకున్నారన్నారు. ఈ విషయం ఇటీవల పర్యటించిన అడిషనల్ డీజీ మహేష్ భగవత్‌కు వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కుమురం భీం తరహాలో మరో పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో అరక ఉమేష్, చాకటి సూర్యారావు, గోవిందరావు పాల్గొన్నారు.

**లోకేశ్వరం** : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు తెలంగాణ భాష, యాస, కాళోజీ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు చిన్నయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్, సాయినాథ్, వినోద్, శ్రీధర్, విఠల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏకధాటి వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

గత నాలుగు రోజుల నుండి వర్షాలు ఏకదాటిగా కురుస్తున్నందున గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ గణపతి సూచించారు. సోమవారం ఇందారం గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిరంతరం పారిశుద్ధ్యం పనులు కొనసాగించాలని ఆదేశించారు. దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టాలని గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. మురికి నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల గ్రామీణులను అప్రమత్తం చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహణ కల్పించాలని సూచించారు. ఇందారం శివారు గోదావరి నది వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలించిన ఆయన గోదావరి వైపు ప్రజలు ఎవరూ వెల్లకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ డీఈ విద్యాసాగర్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఇందారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు..

## వినాయక మండపం వద్ద పోటీల నిర్వహణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద సోమవారం సాయంత్రం పూజా తర్వాత మహిళలకు మండలి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు ఉత్సహంగా పాల్గొని ఆకట్టుకున్నారు. నవరాత్రుల సందర్భంగా పూజాది కార్యక్రమాలతో పాటు పలు పోటీలను నిర్వహిస్తామని మండపాల నిర్వాహకులు తెలిపారు.

# వినాయక విగ్రహా శోభాయాత్రకు సహకరించాలి



నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 16న నిర్వహించనున్న వినాయక విగ్రహాల శోభాయాత్రకు శాఖ పరంగా అధికారులు సహకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ప్రజావాణి అధికారులను కలిసి వినతి పత్రం అందజేసిన సభ్యులు శాఖ పరంగా కనీస వసతుల కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. భీమారం గ్రామ పంచాయతీ కొత్తగూడెం కొత్త చెరువులో విగ్రహ నిమజ్జనం చేయనుండగా క్రేన్ ఏర్పాటు చేసి విగ్రహాలను నిమజ్జనం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కొత్త చెరువు వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం పనుల నిర్వాహణ కోసం గ్రామ పంచాయతి సిబ్బందిని నియమించాలని అన్నారు. వీధి లైట్లకు సంబందించిన విద్యుత్ తీగలు సరి చేయించి విగ్రహాల శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిమజ్జోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు.